రాజ్యాభిషేకం

1

భీమ దుర్యోధనుల చిత్రవిచిత్ర గదాయుద్ధ కౌశలం ప్రేక్షకులనందరినీ దిగ్భ్రాంతిలో ముంచివేసింది. వారి నిద్దరినీ మాటిమాటికీ ప్రత్యేకంగా అభినందించే కురువృద్ధుల జయజయ ధ్వానాలు మిన్నందుకొన్నాయి.

కౌరవ పాండవకుమారుల అస్త్రవిద్యాభ్యాసం పూర్తికాగానే ద్రోణాచార్యుడు వారి అస్త్రవిద్యాకౌశలం పరిశీలించవలసినదని సవినయంగా ధృతరాష్ట్ర చక్రవర్తికి విన్నవించుకొన్నాడు. ధృతరాష్ట్రుడు, గాంధారి, కుంతి, భీష్ముడు మొదలైన కురువృద్ధులంతా తమకోసం ప్రత్యేకంగా ఏర్పరిచిన సింహాసనాలమీద సమాసీనులై అత్యద్భుతమైన కుమారుల అస్త్రవిద్యా ప్రదర్శన కెంతో ఆనందించారు. విదురుడు అంధ దంపతు లిద్దరికీ ఆయా కౌరవ పాండవ కుమారుల అస్త్రవిద్యా చాతుర్యాలు వేర్వేరుగా విన్నవిస్తూంటే వారిద్దరూ అదంతా ప్రత్యక్షంగా చూచినట్లే ఆనందించారు. అంధులైన వారి కనుగొలుకులలో ఆనంద బాష్పాలొక్కమారుగా ఆవిర్భవించాయి. కుమారుడు భీమసేనుని గదాయుద్ధకౌశలం చూచి కుంతి ఎంతైనా సంతోషపడింది.

క్రమక్రమంగా ప్రాతఃకాల సూర్యకిరణాల కాంతులు భీమ దుర్యోధనుల గదాదండాలపై ప్రచండంగా ప్రకాశించాయి. వారిద్దరూ ఒకరొకరికి తీసిపోకుండా అలాగే నిలిచి గదాయుద్ధం కొనసాగించారు.

అలా కొంతసేపు గడిచిపోయేసరికి సభాస్తారుల జయజయ ధ్వానాలింకా బాగా ఎక్కువైపోయాయి. వారంతా అంతకుపూర్వం అనేకమంది కురుకుమారుల అస్త్రవిద్యాచాతుర్యాలు పరిశీలించారు. అవన్నీ ఆత్యాశ్చర్యకరంగానే ఉన్నాయి. కాని భీమ దుర్యోధనుల గదాయుద్ధధోరణే వేరు. కనుకనే సభాస్తారుల అభినందన ధ్వానా లావిధంగా ఆకాశం అందుకున్నాయి.

భీమ దుర్యోధనుల గదాయుద్ధంలో ఇంకొక విడ్డూరం పుట్టింది. ఇంతకు పూర్వం సభాసదులంతా అస్త్రవిద్యాచాతుర్యం మెరయించిన కౌరవపాండవ కుమారులందరినీ అభినందిస్తూ జయజయధ్వానాలు చేశారు. కాని ఇప్పుడు సభలోనివారంతా రెండు పక్షాలుగా చీలిపోయారు, కొందరు ప్రత్యేకంగా భీమసేనుణ్ణి అభినందిస్తూ హర్షధ్వానాలు చేశారు; మరికొందరు దుర్యోధనుణ్ణి అభినందిస్తూ హర్షధ్వానాలు చేశారు.

క్రమక్రమంగా సభ్యులలో పక్షపాతాలు బాగా పెచ్చు పెరిగిపోయాయి. భీమ దుర్యోధనులు కూడా మరింత పట్టుదలతో పెనగులాడడం ప్రారంభించారు. అలా ఎంతసేపు పోరాడినా వారొకరొకరికి కొంచెమైనా తీసిపోలేదు. వారిద్దరూ మరింత అభినివేశంతో పోరాడటం మొదలుపెట్టారు. అభినివేశాలు చూచినకొద్దీ సభ్యులలో క్రోధావేశాలు, ప్రతిజ్ఞలు, పట్టుదలలు మరింత పెచ్చుపెరిగిపోయాయి.

ద్రోణాచార్యుడా వ్యవహారం అంతా బాగా జాగరూకతతో పరిశీలిస్తూనే ఉన్నాడు. క్రమంగా భీమదుర్యోధనుల గదాయుద్ధం శ్రుతిమించిపోగలదనీ, కురువృద్ధులకు మనస్తాప హేతువు కాగలదనీ ఆచార్యునికి భయంవేసింది. వెంటనే అతడు గదాయుద్ధం విరమించవలసినదని అశ్వత్థామ ద్వారా వారిద్దరికీ ఆజ్ఞాపించాడు. తిరిగి సభలో జయజయధ్వనాల కలకలం చెలరేగింది. క్షణంలో భీమదుర్యోధను లిద్దరూ తమ గదాయుద్ధం విరమించివేశారు.

ఆచార్యుడు క్షణంలో రంగ మధ్యంలో నిలబడ్డాడు. తన ప్రియాంతేవాసి అర్జునుని ధనుర్విద్యా కౌశలం కళ్ళారా చూచి ఆనందించవలసిందని కురువృద్ధు లందరికీ సవినయంగా విన్నవించాడు. అర్జును డంతలోనే విల్లమ్ములు ధరించి రంగమధ్యంలో నిలబడ్డాడు.

బంగారు కవచం ధరించిన అర్జును డా సభామధ్యంలో నిలబడగానే సదస్యు లందరూ చకితులై క్షణకాలం రెప్పపాటు లేకుండా అతనివైపే తిలకించారు. నీలమేఘ శ్యామలమైన అర్జునుని శరీరంమీది సువర్ణ కవచం నల్లనల్లని మబ్బుపై మెరిసే మెరుపులా తళ తళ లాడింది. అర్జును డంతలోనే తన ధనుర్విద్యా కౌశల ప్రదర్శన కుపక్రమించాడు.

2

ఆ శూరుని అస్త్రవిద్యా కౌశలం కురువృద్ధు లందరినీ ఆశ్చర్య సాగరంలో ముంచివేసింది. జయజయధ్వానాల కలకలంతో సదస్యుల చెవులు గళ్ళుపడిపోయాయి. ఆ సమయంలో కుంతీదేవి ఆనందాని కిక అంతేలేదు! ఆమె నేత్రాంతాలలో ఆనంద బాష్పా లవిరళ ధారలుగా ప్రవహించాయి. ఆ కలకలం విని ధృతరాష్ట్రు డదిరిపడి దానికి కారణ మేమని విదురుణ్ణి ప్రశ్నించాడు. విదురు డర్జునుని అపూర్వ చాతుర్య ధోరణి అంతా ఆవృద్ధ నృపతి కెరిగించాడు.

ఆ ఆనందవార్త వినగానే ధృతరాష్ట్రుని కంఠం గద్గద భారంతో వణికిపోయింది.

"నేటికిగదా నా వీనులకు సాఫల్యం కలిగింది! కుంతీ కుమారులు త్రేతాగ్నుల్లా ప్రజ్వలిస్తూ ఇక మా కురుకులదురితం అంతా నిశ్శేషంగా నశింపజేయగలరు!"

అని అనేక విధాలుగా కౌంతేయులను, తత్రాపి అర్జునుణ్ణి అనేక విధాల ప్రశంసించాడు. అర్జును డా సమయంలో అనేకమైన దివ్యాస్త్రాలు ప్రయోగించి అపూర్వమైన తన అస్త్రచాతుర్యం మెరయింపజేశాడు. అత్యద్భుతమైన ధోరణులలో, అనేక చిత్రవిచిత్ర గతులలో బాణపరంపరలు ప్రయోగించాడు. అతని చాతుర్యం తిలకిస్తున్న సభాస్తారుల కిక శరీరాలపై స్మృతులే సడలిపోయాయి.

అంతలో రంగద్వారంలో ఒక భయంకరమైన భుజాస్ఫాలనం వినిపించింది. అత్యాశ్చర్యంతో అర్జునుని అస్త్రచాతుర్యం తిలకిస్తున్న సభ్యులందరి చూపులూ ఒక్కమారుగా అటువైపు తిరిగాయి.

బాల సూర్యునివలె ధగద్ధగాయమానంగా వెలిగిపోతూ కర్ణు డక్కడ ప్రత్యక్షమైనాడు. అతని చెక్కిళ్ళపై సహజకుండలాలు రెండు రెండు నక్షత్రాలలా ప్రకాశించాయి.

కర్ణుడు రంగద్వారంలో నిలబడినవారి నందరినీ ఒకతిగించుకుంటూ క్షణంలో రంగమధ్యానికి వచ్చి, ముందుగా కృపాచార్యునికి, ద్రోణా చార్యునికి సవినయంగా నమస్కరించాడు. వెంటనే అర్జునునివైపు తిరిగి వర్షాకాలమేఘంలా గర్జించాడు :

"నీ వొక్కడవే ఈ మహాస్త్రవిద్యలన్నీ నేర్చుకొన్నానని విర్రవీగుతున్నావేమో! వీటిలో కొన్నింటిని నేనూ అభ్యసించాను. నీవు చేసిన అద్భుతాలన్నీ నేనూ చేసి చూపించగలను. అవి చూచిన ఈ పెద్ద లంతా ఇంతకన్నా ఆశ్చర్యపోతారు."

ఆ పరుషవచనాలు వినీవినగానే అర్జునుని కెంతైనా కోపంవచ్చింది. కాని దుర్యోధనుడామాటలు విని సంతోషంతో ఉబ్బితబ్బిబ్బై పోయాడు.

వెంటనే కర్ణుడు ద్రోణుని అభ్యనుజ్ఞతీసుకొని అర్జునుడు ప్రదర్శించిన అద్భుతాలన్నీ ప్రదర్శించాడు. అతని అద్భుతశక్తి చూచి అక్కడి వారంతా శిలాప్రతిమల్లా నిశ్చేష్టులైపోయారు. ఆ అపూర్వ చాతుర్యం వేనోళ్ళ ప్రశంసించారు.

దుర్యోధనుడానందం పట్టలేని అత్యాదరంతో అతన్ని గాఢంగా కౌగలించుకొన్నాడు :

"కర్ణా! ఈ క్షణం నించీ నాతో చెలిమి చెయ్యవలసిందని నిన్నభ్యర్థిస్తున్నాను. నాకు, నా బంధువులకు హితైషివై నా కౌరవ రాజ్యం అంతా స్వయంగా నడిపించవలసిందని నిన్ను ప్రార్థిస్తున్నాను"

అని ఎంతో ఆప్యాయంగా కర్ణుణ్ణి ప్రార్థించాడు. దుర్యోధను డంతటివాడు తన్నావిధంగా ప్రార్థించినందుకు కర్ణుని హృదయం ఆనందసాగరమై ఉప్పొంగింది.

"నా అస్త్రచాతుర్యానికి నీవింతగా ఆశ్చర్యపడవలసినది ఏమి ఉంది? మీ అందరి ఎదుటా పార్థునితో కలిసి ద్వంద్వయుద్ధం చెయ్యాలని నేనెంతో కాలంగా ఉబలాట పడుతున్నాను! అదే నా కోరిక."

అనతి దూరంలో నిలబడి అదంతా తిలకిస్తున్న అర్జునుని కా మాటలు వినిపించాయి. అంతవరకూ తనలో బయలుదేరిన ఆగ్రహం అంతా లోలోపలే నిగ్రహించుకొన్న అర్జును డిక ఓరిమి వహించలేక పోయాడు:

"పిలవనిదే, తగుదునమ్మా అని ఇక్కడికి సిద్ధమై నీ యిష్టం వచ్చినట్లు కారుకూతలు కూస్తున్నావా? తులువా! నీకు పరాత్మ తారతమ్య జ్ఞానం బొత్తిగా లోపించిపోయిందే!"

అదివిని కర్ణుడంతకన్నా రెచ్చిపోయాడు:

"ఈ మాటల కేమిలే! నీనోటికి తగిన సమాధానం నా శస్త్రాస్త్రాలతో ఇస్తున్నాను. రా!"

అని గట్టిగా గర్జించాడు. అంతటితో ఊరుకోలేదు:

"ఈ రంగభూమి కొకరు పిలవవలసిన అవసరం ఏమి ఉంది! వీరవరేణ్యు లందరూ ఇక్కడికి రావడాని కర్హులే! ఇక్కడికి రాకూడదని అడ్డగించడాని కింకొకరికి అధికారం లేదు."

అని యుద్ధ సన్నద్ధుడై అర్జునుని మీదిమీదికి వెళ్ళిపోయాడు.

3

దుర్యోధను డా విధంగా కర్ణునికి ద్వంద్వయుద్ధాని కనుజ్ఞ ఇవ్వడంలో ఆశ్చర్యంలేదు. కర్ణు డా విధంగా ఉరకలు వేసుకుంటూ మీదిమీదికి వచ్చి పడుతున్నప్పు డిక ఉపేక్షించి ఊరుకోవడం పాండవుల కెవ్వరికీ భావ్యంగా కనిపించలేదు. వారుకూడా ఆ ద్వంద్వయుద్ధాని కర్జునుని కనుజ్ఞ ఇచ్చారు.

వెంటనే ఆ ఇద్దరి మధ్య భయంకరమైన ద్వంద్వయుద్ధం ప్రారంభమైంది. వారిద్దరూ ఒకరొకరిమీద ఘోరాస్త్రాలు ప్రయోగించుకొన్నారు.

ఆ ద్వంద్వయుద్ధ ప్రారంభంతో సభ్యులందరిలోనూ పక్షపాతాలు బాగా బలిసిపోయాయి. ధృతరాష్ట్ర చక్రవర్తీ, మిగిలిన కౌరవ కుమారులూ కర్ణునియెడల పక్షపాతం వహించారు. భీష్మ ద్రోణాదులంతా అర్జునునియెడల పక్షపాతం దాల్చారు. అయితే ఆ పక్షపాతాలు పైకి మాత్రం బాహాటంగా వెల్లడి కాలేదు. అవి జయజయ ధ్వానాలలోనే అణిగిపోయాయి.

అంతలో కర్ణుని మేఘాస్త్రం కమ్ముకుని అర్జును డదృశ్యుడై పోయాడు. అదిచూచి కుంతీదేవి దుఃఖంతో కుమిలిపోతూ కూర్చున్న పాటుగానే నేలమీది కొరిగిపోయింది. విదురు డామెకు శీతలోపచారాలు చేయించి నెమ్మదిగా ఓదార్చాడు. అర్జునుడు వాయవ్యాస్త్రం ప్రయోగించి తనపై కమ్ముకొన్న కారుమేఘాల నన్నిటిని ఒక కనురెప్ప పాటుకాలం చెదరగొట్టి వేశాడు. కుంతీదేవి తిరిగి సేదదేరింది.

అంతలోనే కర్ణార్జును లిద్దరికీ శస్త్రాస్త్రాలతో తిరిగీ భయంకరమైన ద్వంద్వయుద్ధం ప్రారంభమైంది.

కృపాచార్యుడు ద్వంద్వయుద్ధం మర్యాదలన్నీ తెలిసిన మనీషి. అతడు భయంకరంగా సాగిపోతున్న కర్ణార్జునుల ద్వంద్వ యుద్ధం క్షణకాలం అతి జాగ్రత్తగా పరిశీలించాడు. వారియుద్ధం అంతటితో ఆగిపోయేటట్లు కనిపించలేదు. వెంటనే మెరుపులా వచ్చి వారిద్దరి మధ్యా నిలుచున్నాడు. తక్షణం ఆ ద్వంద్వయుద్ధం ఆపివేయవలసిందని ఆజ్ఞాపించాడు :

"కర్ణా! అర్జునుడు కుంతీదేవి కుమారుడు. పాండవులకు శ్రేష్ఠుడు. నీ వితనితో యుద్ధం కొనసాగించే పక్షంలో ముందుగా నీ కులగోత్రాలు తెలియజెయ్యడం ధర్మం. ఆపైన అర్జునుడు నీ కెదురుగా నిలిచి పోరాడగలడు. అంతవరకు ఈ ద్వంద్వయుద్ధం ధర్మసమ్మతం కాదు."

ఆ మాటలు వినగానే కర్ణుని చేతులలోని విల్లమ్ము లప్రయత్నంగా జారి నేలమీద పడిపోయాయి. అతడు సూతకులజుడు. తన కుల గోత్రా లుచ్చరించడానికే అతనికి నోరాడలేదు. వల్లమాలిన సంకోచంతో అతని శిరస్సు నేలవైపు ఒరిగిపోయింది.

అది చూచి దుర్యోధనుడు కృపాచార్యుని సన్నిధికి వచ్చి విరుచుకు పడ్డాడు:

"ఆచార్యా! రాజ్యాధిపత్యానికి మూడు విధాలైన అర్హత లున్నాయని పెద్దలంటారు. కులీనుడు, శౌర్యవంతుడు, సేనాబలశాలి రాజ్యాధిపత్యాని కర్హులు. కర్ణుడు రాజు కాకపోవడంవల్ల నే ఇత డర్జును నితో ద్వంద్వ యుద్ధాని కనర్హుడని తాము సెలవిస్తున్నారు. నేనీ క్షణం లోనే కర్ణుని కంగరాజ్యాభిషేకం చేస్తున్నాను."

అని, భీష్మ ధృతరాష్ట్రుల అభ్యనుజ్ఞ స్వీకరించి వెంటనే కర్ణునికి అంగ రాజ్యాభిషేక సన్నాహాలు చేయించాడు.

క్షణంలో కర్ణుణ్ణి బంగారు సింహాసనం మీద కూర్చోబెట్టి సకల రాజచిహ్నాలతోను, మర్యాదలతోను అతని కంగరాజ్యాభిషేకం చేయించాడు. వేలకొలది భూసురులకు గోసహస్రాలు దానాలు చేయించాడు. అక్షతలతోబాటు భూసురుల ఆశీర్వచన సహస్రాలు కోకొల్లలుగా కర్ణుని శిరస్సుపై వర్షించాయి.

ఆ మహాగౌరవానికి కర్ణు డెంతో ఆనందించి దుర్యోధనుని గాఢంగా కౌగలించుకొన్నాడు.

"ఇంతటి మహాగౌరవం చేసిన నీ ఋణం నే నే విధంగా తీర్చు కోగలను!" అని అత్యాదరదృష్టితో దుర్యోధనుని వైపు చూచాడు.

"కర్ణా! నీ సఖ్యమే నేను కోరుకొనే వరం!" అన్నాడు ఆయన.

కర్ణుని జనకుడు-సూతు డిది చూచి నిలువునా నిర్ఘాంతపోయాడు. ఎక్కడో దొరికిన తన శిశు వీనా డింతవాడై నాడు గదా అని పరమా నందభరితుడై నాడు. కర్ణుణ్ణి కౌగలించుకొని ఆనందాశ్రువులతో అతని శిరస్సు తడిపివేశాడు.

భీమసేనుని కా మహోత్సాహం చూచీ చూడగానే ఒక్క సారిగా అరికాలిమంట నెత్తికెక్కింది. కర్ణునివైపు తిరిగి ఒక్క విషపు నవ్వు నవ్వాడు:

"తోలు కర్ర చేతబట్టి రథము తోలుకోవలసిన నీకు అర్జునునితో సరిసమానంగా ఎదుట నిలిచి పోరాడే అర్హత ఎక్కడనించి వస్తుంది?

"ఇక ఈ క్షణంనించీ అంగ రాజ్యాధిపతి నైనానని విర్రవీగు తున్నావేమో! అది ఉత్తమ క్షత్రియకుమారులు చేపట్టవలసిన రాజ్యం! మంత్రపూతమైన పురోడాశం భక్షించే అర్హత యాజకునికే గాని కుక్క కెక్కడిది?"

అని కర్ణుణ్ణి గడ్డిపరకలా ఈసడించి వేశాడు. పాపం! కర్ణుని కా సమయంలో ఏమనడానికీ పాలుపోలేదు. వెలవెలబోయిన ముఖంతో ఆకాశంవైపు చూస్తూ నిలుచున్నాడు.

అంతలోనే దుర్యోధనుడు మళ్ళీ భీమునిమీద విరుచుకుపడ్డాడు.

"భీమా! నీ వీ విధంగా మాట్లాడడం న్యాయమేనా? లేడి కడుపున పులి పుట్టడం ఎక్కడైనా విన్నామా? ఇంతటి మహా తేజశ్శాలి అధమాన్వయంలో జన్మిస్తాడా? అదీకాక మహావీరుల పుట్టు పూర్వోత్తరా లెవరు నిర్ణయించగలరు? కుమారస్వామి ఱెల్లులో జన్మించలేదా? ద్రోణాచార్యులు కుంభంలో జన్మించలేదా? అంత వర కెందుకు? మీ రంతా ఎలా జన్మించారో ప్రపంచానికే తెలియదా?

"కర్ణుడు అంగరాజ్యానికేగాదు, భూమండలానికంతటికీ ఏకచ్ఛత్రాధిపత్యం వహించగల దక్షుడు!"

అని కర్ణుణ్ణి స్వయంగా తన వెంట రాజగృహానికి తీసుకుపోయాడు.

కుంతీదేవి హృదయంలో కర్ణుణ్ణి గుర్తుపట్టింది. కాని ఆ రహస్యం పైకి వెల్లడించడాని కిష్టంలేక తెలిసీ తెలియనట్టుగా మాట్లాడ కూరుకొన్నది.

'ఇంతకాలానికి అర్జునుని కెదురుగా నిలిచి నీవా నేనా అని పోరాడగల వీరాధివీరుడు లభించాడు గదా' అని దుర్యోధనుడా నాటి రాత్రి గుండెలమీద చెయ్యి వేసుకొని హాయిగా నిద్ర పోయాడు.